## చుక్కల్లో చికెన్ ధరలు..



వివరాలు 04లో..


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

Editor: Vanam Nagaiah

హైదరాబాద్
మంగళవారం
27-02-2024

వెల రూ.4/-
సంపుటి: 01 సంచిక: 15
పేజీలు: 04




## అంతర్జాతీయ ఎగుమతుల హబ్‌గా భారత్

- టెక్స్‌టైల్ రంగంలో భారీగా విదేశీ పెట్టుబడులు
- భారత్ టెక్స్ 2024ను ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:

భారత్‌ను అంతర్జాతీయ ఎగుమతుల హబ్‌గా మారుస్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మంటపంలో భారత్ టెక్స్ 2024ను ప్రారంభిస్తూ ప్రధాని మాట్లాడారు. రాబోయే పాతికేండ్లలో భారత్‌ను తాము వికసిత్ రాజ్యంగా ఆవిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని మిగతా 2లో..





## పదేళ్లలో వందేళ్ల విధ్వంసం

### అభివృద్ధి పేరు అప్పుల ఊబిలోకి తెలంగాణ..

### మోదీనే మరోసారి ఎందుకు ఎన్నుకోవాలి..

- కుంగిపోయిన మేడిగడ్డను ఎలా బాగుచేయాలో చెప్పరు
- బిజెపి, బిఆర్ఎస్ నేతలది కాంగ్రెస్‌ను తిట్టడమే ఎజెండా
- రాష్ట్ర అభివృద్ధిలో ఈ రెండు పార్టీలది ఒకటే బాట
- సింగరేణి కార్మికులకు కోటిబీమా పథకం ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:

**గత బిఆర్ఎస్ సర్కార్..** తన పదేండ్లలో ఎన్నడూ లేనంతగా వందేళ్ల విధ్వంసం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ నష్టాన్ని పూడ్చే ప్రయత్నంలో కసరత్తు చేస్తున్నామని అన్నారు. సింగరేణి కార్మికులు ఉద్యమంలో కీలకంగా ఉన్నారని.. వారికి ప్రమాద బీమాను కోటి రూపాయలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. బ్యాంకులతో ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. గత పాలకులు సింగరేణిని ప్రవేటు పరం చేసే కుట్ర చేశారని ఆరోపించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ మిగతా 2లో..

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- క్రమబద్దీకరణకు అనుమతించిన సిఎం
- మార్చి 31లోగా దరఖాస్తుల క్లీయర్
- దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టుల్లో ఉన్నవాటికి నో..

2



## ఆధాయ మార్గాలపై కసరత్తు

- పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలి..
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్






హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:

**తెలంగాణ ముఖ్యమంత్రి** రేవంత్ రెడ్డి కీలక శాఖలపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్య శాఖలపై సమగ్రంగా రివ్యూ చేస్తూ చేయాల్సిన మార్పులు, చేర్పులపై దృష్టి సారిస్తున్నారు. అంతేకాదు.. అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశిస్తున్నారు. తాజాగా 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన మిగతా 2లో..





## గ్రూప్1 అభ్యర్థుల నిరీక్షణకు తెర

- షెడ్యూల్ విడుదల చేసిన సర్వీస్ కమిషన్..

హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:

ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న గ్రూప్ 1 అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. రేవంత్ సర్కార్ గ్రూప్ 1 అభ్యర్థులకు శుభవార్త తెలిపింది. ప్రిలిమ్స్ పరీక్ష మిగతా 2లో..



## 28 నుంచి ఇంటర్ పరీక్షలు

2

## మోదీ వెంటే.. మహిళలు, యువత

- దేశప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు
- బీజేపీ నేత ఈటెల రాజేందర్..

గజ్వేల్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:

మహిళలు, యువత ప్రధాని మోదీ వెంట ఉన్నారని, ఆయనను మరోసారి గెలిపించుకునేందుకు సిద్ధం కావాలని బిజెపి నేత ఈటెల రాజేందర్ అన్నారు. పదేళ్ల కిందట హైదరాబాద్ పోవాలంటే బాంబులు పేలి చనిపోతారనే భయం ఉండేదని, మోదీ వచ్చాక బాంబుల మోతలు ఆగిపోయాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన గజ్వేల్ నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా రాజరాజేశ్వర క్లస్టర్ - మెదక్‌లో రోడ్‌షోలో ఈటల పాల్గొని ప్రసంగించించారు. మిగతా 2లో..



## నేతన్నకు పెద్దన్న..

- పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి
- పద్మశాలీల పట్ల బీఆర్ఎస్ నిర్లక్ష్యం
- తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో మా పాత్ర అమోఘం
- అగ్గిపెట్టెలో ఇమిడే చీర.. కళాత్మకత మా సొంతం
- కొండా లక్ష్మణ్ బాపూజీ, సిరిపురం యాదయ్య త్యాగాలు చరిత్రకు సాక్ష్యాలు
- టెస్కో సమస్యలు మంత్రి తుమ్మల పరిష్కరిస్తారు.
- కెరటం న్యూస్‌తో రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి

వనం నాగయ్య, కెరటం న్యూస్

నారాయణ పేట నాణ్యమైన పట్టు.. సిద్దిపేట సొగసైన గొల్లభామ చీరలు..పుట్టపాక ప్రతిభను ప్రపంచానికి చాటిన తేలియ రుమాలు, వరంగల్ వైభవాన్ని, సంప్రదాయానికి రంగులద్దిన అరుద్మైన తివాచీలు.. ఇలా తెలంగాణలోని ఎన్నో కళాత్మక చేనేత వస్త్రాలు తెలంగాణకు, భారతదేశానికి తలమానికమై, ప్రత్యేకమైనవిగా, వారసత్వ సంపదగా కీర్తి గడిరచాయి. ఇలాంటి అపురూపమైన డిజైన్లు, సంప్రదాయ బద్ధంగా రూపకల్పన చేసిన వస్త్రాలు యావత్ దేశంలోనే మచ్చుకైనా కని పించవు అంటే అతిశయోక్తి కాదు. అంతెందుకు చిన్ని అగ్గిపెట్టెలో అద్భుతంగా ఇమిడిపోయే చీరను మిగతా 2లో..




## నేటి నుంచే మరో రెండు పథకాలు..

- మొత్తం బిల్లు వినియోగదారుడు కట్టాలి
- బ్యాంకు ఖాతాలో జమ చేయనున్న సర్కారు
- 200 లోపు యూనిట్ల అన్నింటికీ జీరో బిల్..

2



## రైల్వేల అభివృద్ధితో ప్రజల ఉన్నతి

- దేశవ్యాప్తంగా రైల్వేల ఆధునీకరణకు ప్రధాని మోడీ శ్రీకారం..
- పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సిఎం..

2



## గ్రూప్1 అభ్యర్థుల నిరీక్షణకు తెర

(మొదటి పేజీ తరువాయి..)

తేదీలను ఖరారు చేస్తూ టీఎస్పీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను జూన్ 9న నిర్వహించ నున్నట్లు టీఎస్పీఎస్సీ ప్రకటించింది. 563 ఉద్యోగాలకు మార్చి 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వయోపరిమితి 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు పెంచారు. దరఖాస్తుల సవరణకు మార్చి 23 నుంచి మార్చి 27 వరకు అవకాశం కల్పించారు. అప్లికేషన్ ప్రాసెస్ ఫీజును రూ.200గా,పరీక్ష ఫీజు రూ.120గా నిర్ణయించారు. పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న వాళ్లు మళ్లీ అప్లై చేసుకోవాల్సిం దేనని.. అయితే.. గతంలో ఫీజు చెల్లించిన వాళ్లు మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని టీఎస్పీఎస్సీ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ప్రిలిమ్స్ జరగనుంది. మెయిన్ పరీక్షను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకుల అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం పకడ్బందీ జాగ్రత్తలు తీసుకుంటోంది.

## 28 నుంచి ఇంటర్ పరీక్షలు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి26:**

ఇంటర్ పరీక్షల సందడి మొదలు కానుంది. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ ఎగ్జామ్స్ జరుగనున్నాయి. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని ఇంటర్ బోర్డ్ సెక్రటరీ శృతి ఓజా తెలిపారు. సోమవారం మీడి యాతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 1521 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 9, 80, 978 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ 4,78, 718 మంది, ఇంటర్ సెకండ్ ఇయర్ స్టూడెంట్స్ 5,02, 260 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. పూర్తి స్థాయిలో స్టూడెంట్ ఫ్రెండ్లీగా ఏర్పాట్లు జరిగాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రా లలోకి మొబైల్ అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు ఇది కేవలం ఒక పరీక్ష మాత్రమే అని గుర్తుంచుకోవాలన్నారు. కష్టపడి చదివారు... విద్యార్థులు మానసిక ఒత్తిడి తీసుకోకుండా ప్రశాం తంగా ఎగ్జామ్ రాయాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలతో పరీక్షల నిర్వహణపై రివ్యూ చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరా లు, కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వంద శాతం సిలబస్ పూర్తి చేశామన్నారు. ఒక్క నిమిషం నిబంధన అమలు కంటే అందరూ 9 గంటలలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని.. 9 తరువాత అనుమతి లేదని తెలిపారు. 475 మంది ఇంటర్ పరీక్షల గురించి టెలి మానస్‌కి కాల్స్ చేశారన్నారు. ఈసారి కూడా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ టీచర్స్ ఇంటర్ బోర్డు పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్నామని శృతి ఓజా వెల్లడించారు.

## అంతర్జాతీయ ఎగుమతుల హబ్‌గా భారత్

(మొదటి పేజీ తరువాయి..)

స్పష్టం చేశారు. పేదలు, యువత, రైతులు, మహిళల సంక్షేమం లక్ష్యంగా వికసిత్ భారత్ స్వప్నం సాకారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల ఫలితంగా భారత టెక్స్‌టైల్ రంగంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని చెప్పారు. 2014తో పోలిస్తే ప్రస్తుతం టెక్స్‌టైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రెట్టింపయ్యాయని ప్రధాని మోదీ వెల్లడించారు. దేశంలో జౌళి పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నదని వివరించారు. 2014లో దేశంలో టెక్స్‌టైల్ మార్కెట్ విలువ రూ. 7 లక్షల కోట్ల కంటే తక్కువగా ఉండగా, ప్రస్తుతం ఆ విలువ రూ. 12 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. గత పదేండ్లలో నూలు, దుస్తులు, అపెరల్ ఉత్పత్తి ఏకంగా 25 శాతం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి 100 దేశాల నుంచి మూడు వేల మందికి పైగా ఎగ్జిబిటర్లు, కొనుగోలుదారులు, 40 వేల మంది వాణిజ్య సందర్శకులు హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. టెక్స్‌టైల్స్ రంగం భవిష్యత్తులో దేశ అభివృద్ధికి కీలకంగా మారనుందన్నారు. 'దేశానికి స్వాతంత్యం÷-ర వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తవుతుంది. అప్పటికి భారత్ అభివృద్ధిలో టెక్స్‌టైల్స్ రంగం కీలకపాత్ర పోషించనుంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంది. 2014 భారత్ టెక్స్‌టైల్స్ మార్కెట్ విలువ రూ.7 లక్షల కోట్ల కంటే తక్కువగా ఉంది. ప్రస్తుతం అది రూ. 12 లక్షల కోట్లకు చేరుకుంది. మరి కొన్నేళ్లలో దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చాల ని కేంద్రం సంకల్పించిం దని మోదీ పేర్కొన్నారు. వికసిత్ భారత్‌కు పేదలు, రైతులు, యువత, మహిళలు ముఖ్య స్తంభాలని అన్నారు. వీరితో భారత్ టెక్స్‌టైల్స్ రంగం ముడిపడి ఉందన్నారు. అందువల్ల ఈ కార్యక్రమం మనందరికీ ఎంతో ముఖ్య మైందని మోదీ పేర్కొన్నారు. తాను ఎలాంటి సమాజాన్ని చూడాలనుకుం టున్నారో ప్రధాని ఈసం దర్భంగా వెల్లడించారు. ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉన్న సమాజాన్ని సృష్టించడమే తన లక్ష్యమని తెలిపారు. ఇది ప్రజల శ్రేయస్సుకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుంద న్నారు. అందుకు పదేళ్లుగా పోరాడు తున్నానని.. రానున్న ఐదేళ్లల్లో ఈ జోక్యాన్ని పూర్తిగా తగ్గిస్తానని మోదీ హామీ ఇచ్చారు.

## మోదీ వెంటే.. మహిళలు, యువత..

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ పాలన ఎటు చూసినా కుంభకోణాలే కనిపించేవని, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు. 10 లక్షల మంది మహిళలకు వడ్డీలేని రుణాలు, ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన పథకంతో పేదలకు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. బీజేపీ మూడోసారి హ్యాట్రిక్ సాధించి, మోదీ మూడోసారి ప్రధాని అవుతారని ఈటల ఆకాంక్షించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కేసీఆర్ పై ప్రజల్లో ఉన్న కోపమే కారణమని.. అందుకే ప్రజలు కాంగ్రెస్ కు ఓట్లు వేశారని బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కానీ లోక్‌సభ ఎన్నికల్లో సీన్ రివర్స్ అవుతుందని, ప్రధాని మోదీ మీద నమ్మకంతో బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పై ఉన్న కోపంతోనే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓట్లు వేశారని.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తామని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. "మోదీ పేద ఇంటి నుండి వచ్చిన బిడ్డ కాబట్టి పేదల కష్టాలు తీరుస్తున్నారు. దేశంలో ఏ ఒక్కరూ ఇళ్లు లేకుండా ఉండకూడదు అని ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికీ 4 కోట్ల ఇల్లు కట్టించి ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తా అని కేసీఆర్ మోసం చేశాడు. గ్రామపంచాయితీ సిబ్బందికి కూడా మోదీ డబ్బులు పంపించకపోతే జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. చెట్లు, లైట్లు, మోరీలు, రోడ్లు అన్నీ కేంద్ర నిధులతోనే వేస్తున్నారు. సఫాయి కార్మికుల కాళ్లుకడిగి గౌరవం పెంచితే, కేసీఆర్ 1700 మంది ఉద్యోగాలు తీసివేశారు. కరోనా వ్యాప్తి సమయంలో దేశానికి ధైర్యాన్ని అందించిన వ్యక్తి ప్రధాని మోదీ. ప్రపంచానికి వాక్సిన్ అందించారు.

# పదేళ్లలో వందేళ్ల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి..)

రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మనం బ్యాంకులకు కట్టాల్సిన అప్పే రూ.70వేల కోట్లు ఉంది. మిగులు రాష్ట్రాన్ని అప్పుల సంక్షోభంలోకి నెట్టారు. ధనదాహానికి బలైన ప్రాజెక్టులను ఏం చేయాలో అర్థం కావడంలేదు. కుంగిన మేడిగడ్డను ఎలా బాగు చేయాలో సలహా ఇవ్వరు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనపై అసెంబ్లీలో ప్రత్యేక సమావేశాలు పెడ్తాం.. చర్చించేందుకు బిఆర్ఎస్ నేతలు సిద్ధమా? అని సవాల్ చేశారు. . గత ప్రభుత్వ తప్పిదాలను ప్రజలకు వివరిస్తున్నాం. ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. బిఆర్ఎస్, బిజెపి కలిసి కాంగ్రెస్ పై దాడి చేస్తున్నాయి. స్వార్థం కోసం బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ రెండు పార్టీలు ఒక్కటేనని వారి విమర్శలను బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. తెలంగాణను ఆంధ్రావాళ్ల కంటే ఎక్కువ విధ్వంసం చేసిన ఘనత కెసిఆర్ దే. ఇంకా బిఆర్ఎస్ నేతలు అబద్దాలు చెప్పి.. ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనకు.. బిజెపి పాలనకు తేడా ఏముంది?. రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సహకరించడంలేదు. హైదరాబాద్ వరదల్లో మునిగితే.. కిషన్ రెడ్డి ఏం తీసుకొచ్చాడు. మూడోసారి మోడీని ఎందుకు ప్రధానిని చేయాలి.. ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి రైతులను కాల్చి చంపడానికా?' అని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి సంస్థ కూడా కీలక పాత్ర పోషించిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కానీ బీఆర్ఎస్ పాలనలో గత పదేళ్లు సింగరేణి కార్మికులకు సరైన న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు. 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కానీ రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు తమ వంతు పాత్ర పోషించారని కొనియాడారు. గత 10 ఏళ్లు సింగరేణి కార్మికులకు సరైన న్యాయం జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు రాష్ట్రాన్ని దివాళా తీయించిందని విమర్శించారు. 43 వేల మంది కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా పథకం వర్తిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా రూ.40 లక్షల బీమా పథకం అమలు చేస్తామన్నారు. సింగరేణి కార్మికులకు మొత్తంగా రూ.1.20 కోట్ల పరిహారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు. కోటి రూపాయల ప్రమాద బీమా పథకం ఇప్పటివరకు సైనికులకు మాత్రమే ఉందని, ఇప్పుడు సింగరేణి కార్మికులకు అంత మొత్తంలో ప్రమాద బీమా అమలు చేస్తున్నామని సింగరేణి ఎండీ బలరామ్ అన్నారు. పెద్ద మొత్తంలో సింగరేణి కార్మికులకు బీమా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లే అవుట్ల క్రమబద్ధీకరణకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. గతంలో లేవుట్ల క్రమబద్ధీకరణకు అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భారీ గా దరఖాస్తులు వెల్లువెత్తాయి. వాటిని పరిశీలిం చిన ప్రభుత్వం.. 31 వరకు వీలు కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర అవుట్స్ క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మంది దరఖాస్తుదారులకు లాభం చేకూరనున్నది. 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి 31లోపు క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వా లని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. లేఔట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు వీలు కల్పించింది. దాంతో 20 లక్షల మందికి ప్రయోజనం చేకూర నుంది. దేవాయల, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూ ములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు తప్పా, ఇతర భూముల రెగ్యులరైజేషన్ కు అడ్డంకులు తొలగినట్లయింది. లేఔట్ల భూములను క్రమబ ద్ధీకరణ చేసుకునేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభు త్వం ఎల్ఆర్ఎస్ విధానాన్ని తీసుకొచ్చింది. తంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ వల్ల స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరింది. అనుమతి లేకుండా చేసిన లే అవుట్లలో కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరించుకునేందుకు సర్కార్ మరోసారి అవకాశం కల్పించింది. అనధికార లే ఔట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు రాక, అటు అమ్ముకు నేందుకు వీలు లేకుండా ఉండేది. ఈ క్రమంలో ఆ లే ఔట్లలో ఉన్న ఎ÷-లాట్లను క్రమబద్ధీకరించ డానికి గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం తీసుకొ చ్చింది. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ధర ఖాస్తులు వచ్చాయి. కొందరు కోర్టులను ఆశ్రయిం చడంతో కొంతకాలం నుంచి ఈ పక్రియకు బ్రేక్ పడింది. తాజాగా ప్రభుత్వం లే ఔట్ల కోసం ఎల్ ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 31 లోగా క్రమబద్ధీకరిం చుకునే అవకాశం కల్పించిం ది. ఎల్ఆర్ఎస్‌కు ధరఖాస్తు చేసుకునేం దుకు ప్రభుత్వ, అసైన్డ్, దేవా దాయ భూములు, వక్ఫ్ భూములు, చెరువు శిఖం భూములలో ఉన్న లే అవుట్లకు అనుమతి ఇవ్వకూడదని తొలగించారు.

## ఆదాయ మార్గాలపై కసరత్తు..

(మొదటి పేజీ తరువాయి..)

కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల ఉన్నతాది కారులు పాల్గొన్నారు.పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతే డాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకు పైగా చెల్లించలేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు రాకపోవడంతో రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోం దని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకో వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కలు తేడాలు ఉంటు న్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే బిల్లులు కచ్చితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రిజి స్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## రైల్వేల అభివృద్ధితో ప్రజల ఉన్నతి

**హైదరాబాద్/న్యూఢిల్లీ, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:**

రైల్వేను అభివృద్ధి చేస్తే.. అది ప్రజల ఉన్నతికి దోహదపడుతుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద రైల్వేస్టేషన్ల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో 15 రైల్వేస్టేషన్లను రూ.230 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నట్లు చెప్పారు. బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. బేగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో కలిసి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు విమానాల మాదిరిగా దూసుకుపోతున్నాయని గవర్నర్ అన్నారు. మన రాష్ట్రానికి పలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు వచ్చాయని, భవిష్యత్‌లో మరిన్ని వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనటం శు భపరిణామం అని తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం కానుకగా ఇస్తుందని ఆశిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. దీనిపై రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ వంటి వారు చొరవచూపాలని కోరారు. దేశం నలుమూలలను కలుపుతున్న అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థ రైల్వే అని, తక్కువ ధరతో ఎక్కువ దూరం ప్రయాణించవచ్చన్నారు. రైల్వే శాఖకు పూర్తి సహాయ సహకారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మోదీ అంటే అభివృద్ధికి మారు పేరు అని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధికి, మౌలిక సదుపాయాలకు కేంద్రం భారీ ఎత్తున ఖర్చు చేస్తుందన్నారు. బ్జడెట్‌లో రైల్వే కోసం తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.4,400కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సోమవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. బోధన్ పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ నేతలు పాల్గొన్నారు. తర్వాత మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తదితర నేతలు పాల్గొన్నారు.


## నేటి నుంచే మరో రెండు పథకాలు..

**హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి26:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నేటి నుంచి మరో రెండు గ్యారెంటీలను ప్రారంభించనుంది. ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ ఈ రెండు పథకాలను ప్రారంభించను న్నారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆమె పతకాలను ప్రారం భిస్తారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహ జ్యోతి పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. చేవెళ్లలో సబ్సిడీ సిలిండర్‌తోపాటు గృహావసరాలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా అందించే గృహలక్ష్మి పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి త్వరలో ప్రారంభించనున్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతున్న ది. ఈ పథకాల విధి విధానాలపై ప్రజల్లో గందరగోళం ఉంది. ఎవరికి వర్తింప జేస్తారు..? రూ. 500 కే సిలిండర్ ఎలా ఇస్తారు..? అమలు ఎలా అన్న సందేహాలు వెంటా డుతున్నాయి. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఎలా అమలు చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఆధార్ కార్డు, సర్వీస్ నంబర్, రేషన్ కార్డు వివరాల ఆధారంగా వర్తింపజేస్తారనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. దీనిపై సర్కారు క్లారిటీ ఇవ్వనుందని తెలుస్తోంది. ఆరు గ్యారెం టీల్లో భాగంగా ప్రభుత్వం రేపటి నుంచి అమలు చేయ నున్న మరో పథకం 200 యూనిట్లలో లోపు విద్యుత్ విని యోగించే ఇండ్లకు ఫ్రీ. సాధారణంగా ఇండ్లకు వచ్చే బిల్లింగ్ ఆపరేటర్లు బిల్ చేసి 200 యూనిట్లలోపు నమోదైతే ఆటోమేటిక్ గా జీరో బిల్ వచ్చేలా బిల్ జనరేటెడ్ మెషిన్లను సెట్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ పథకం రేపు లాంచ్ అయితే మార్చి నెలలో 200 యూనిట్లలోపు కరెంటు వాడిన వినియోగదారులకు జీరో బిల్లు వస్తుంది. గ్యాస్ వినియోగదారుల్లో నెలకొన్న గందరగోళంపై ప్రభు త్వం క్లారిటీ ఇచ్చింది. అర్హులైన లబ్ధిదారుకు రూ 500 కే సిలిండర్ అందేలా చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న రాయితీని కూడా పరిగణ నలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ.955 ఉంటే.. లబ్ది దారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.40 పోను మిగతా రూ.415ని రాష్ట్ర ప్రభుత్వ రాయితీగా లబ్దిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని సమాచారం. గ్యాస్ సిలిండర్ ధర నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంది. హైదరాబాద్‌లో రూ.955 ఉంటే.. మిగత పట్టణాల్లో రూ.970, 974గా ఉంది. ఇందుకు కారణం రవాణా చార్జీల్లో వ్యత్యాసమే. రాష్ట్రంలో 11.58 లక్షల ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరికి కేంద్రం నుంచి సిలిండర్‌కు రూ.340 రాయితీ లభిస్తోంది. ఉదాహరణకు ఉజ్వల సిలిండర్ ధర రూ.970 ఉందనుకుంటే లబ్దిదారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.340 పోను రూ.130ని రాష్ట్ర ప్రభుత్వ రాయి తీగా జమ చేస్తుంది. మార్కెటింగ్ కంపెనీలకు మహాలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్దిదారుల జాబితాను జిల్లాల అధికారులు గ్యాస్ కంపెనీలకు అందజేశారు. ఇందుకోసం ఈ మేరకు రూ.80 కోట్ల విడుదలకు అనుమతిస్తూ పౌరస రఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లబ్దిదారులకు ఇచ్చే సిలిండర్ల సంఖ్యను బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ మొత్తం ఎప్పటికప్పుడు ఆయిల్ కంపెనీలకు జమవుతుంది.

## నేతన్నకు పెద్దన్న..

(మొదటి పేజీ తరువాయి..)



తాయరుచేసి ప్రపంచానికి సరికొత్త వింతను పరిచయం చేసి అబ్బురపరిచింది కూడా నేతన్నే.. అంతటి కళావైభవం నేతన్నల సొంతం..భారతదేశ వ్యాప్తంగా 60లక్షల చేనేత కుటుం బాలున్నాయి. ఒక్క మాటలో పద్మశాలీల గొప్పతనం చెప్పాలంటే ప్రపంచానికి అందించే వస్త్రాల్లో 90శాతం నేత కార్మికులున్నది ఒక్క భారతదేశంలోనే. మరి ఇంత ఘన చరిత్ర కలిగిన చేనేత కార్మికులు నేడు ధ్నెన్యం గా ఉంటున్నారా..? మగ్గాల చప్పుళ్ల మాటల వారి ఆకలి కేకలు ఎవరికీ వినిపించడం లేదా..? తమ కళా న్నెపుణ్యంతో ప్రపంచాన్నే నివ్వెరపరిచిన నేతన్నల ఆకలి కేకలు, ఆత్మహత్యలకు ఫుల్ స్టాఫ్ పడాలంటే ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా చేనేత కార్మికులకు సంక్షేమం అమలుచేస్తుందా అంటే అవుననే అంటున్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో అనేక త్యాగాలకు, వెలకట్టలేని ఉద్యమా లను నిర్మించి పద్మశాలీలు కాంగ్రెస్ హయాంలో పూర్వ వైభవం సాధించు కుంటారంటున్న పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళితో కెరటం న్యూస్ ప్రత్యేక ఇంటర్వ్యూ...




### తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో మా పాత్ర అమోఘం

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 30లక్షల మంది పద్మశాలీలున్నారనీ, వారిలో 70వేల కుటుంబాలు చేనేత కార్మికులుగా ఉండగా అందులో 90శాతం మంద చేనేతపైనే ఆధారపడి ఉన్నారని పద్మశాలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి అన్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారని గుర్తుచేశారు. మలి దశ ఉద్యమంలోనూ 98 ఏండ్ల వయసులో ప్రొ.కొండాలక్ష్మణ్ బాపూజీ ఎముకలు కొరికే చలిలోనూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తెలంగాణకోసం వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. మలి దశ ఉద్యమంలోనే పద్మశాలీ కుటుంబ సభ్యుడు సిరిపురం యాదయ్య తెలంగాణ కోసం ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు దగ్గర పెట్రోలు పోసుకుని ఆత్మ బలిదానం చేసుకున్నారని గుర్తుచేశారు. వీరితో పాటు ఎందరో పద్మశాలీలు తెలంగాణ ఉద్యమంలో కేసుల్లో జైళ్లల్లో మగ్గారని గుర్తుచేశారు.

### పద్మశాలీలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు...

తెలంగాణ సాధనలో ఎంతో కృషిచేసిన పద్మశాలీలకు స్వరాష్ట్రంలో సెంటిమెంట్‌తో అధికారం లోకి వచ్చిన బీఆర్ఎస్ వల్ల పద్మశాలీలకు ఒరిగిందేమీ లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి విమర్శించారు. 2014కు ముందు కాంగ్రెస్ హయాంలో పద్మశాలీలు గౌరవంగా ఉన్నారని గుర్తుచేశారు. 2001 నుండి 2005 వరకూ ఉమ్మడి రాష్ట్రంలో ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలున్నారనీ, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ఒక్కరంటే ఒక్కరు కూడా చట్ట సభల్లో ప్రతినిధ్యం లేకుండా పోయారని విమర్శించారు. అందుకే జనాభా దామాషా ప్రకారం 'మేమెంతో మాకంత..' నినాదంతో ముందుకెళతామన్నారు. చేనేత, జౌళి, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి పద్మశాలీలు, నేతన్నల సమస్యలు తీసుకెళ్లామనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన టెస్కో బకాయిల్లో మంత్రి తుమ్మల చొరవ తీసుకుని 4.5కోట్లు విడుదల చేశారని అన్నారు. తెలంగాణ జనాభాలో 8శాతంగా ఉన్న పద్మశాలీలు ఆర్థికంగా, విద్య, రాజకీయం పరంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికులకోసం ఎంతో చేస్తున్నట్టు చెప్పిన కేటీఆర్ బతుకమ్మ చీరలు నేసిన వారికి రూ.250 కోట్లు, టెస్కోకు రూ.450 కోట్లు బకాయిలు పెట్టారని ఆరోపించారు.

**మంత్రి తుమ్మల అండగా ఉంటారు..:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పద్మశాలీల పట్ల జరిగిన నిర్లక్ష్యం గురించి, నేతన్నల సమస్యల గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి సమస్యలు తీసుకెళితే వెంటనే స్పందించి రూ.4.5కోట్లు విడుదల చేయడంతో పాటు కీలకమైన టెస్కోకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని కమర్తపు మురళి తెలిపారు. ఇటీవల రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేనేతపై బీజేపీ విధించిన 5శాతం జీఎస్టీని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా తొలగిస్తా మని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో టెస్కో, పవర్ లూమ్, హ్యాండ్లూమ్ కు మూడు కార్పొరేషన్ పదవులు ప్రకటించిన కేసీఆర్ ఆయా కార్పొరేషన్ చైర్మన్లు కూర్చునేందుకు కనీసం కుర్చీ కూడా లేకుండా చేసి అవమానించారని విమర్శించారు. అద్భుత పనితనంతో కళా త్మకంగా వస్త్రాలు తయారు చేస్తున్న నేతన్నల తలరాతలు మారాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమ న్నారు. గంటల తరబడి రెండు చేతులూ నిరంతరాయంగా ఆడిస్తేనే నాలుగు ముద్దలు నోట్లోకి వెళ్లే నేతన్నల కుటుంబాల దుస్థితిని కాంగ్రెస్ హయాంలో తరిమివేస్తామని, ముఖ్యంగా పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నా కర్తవ్యాన్ని మరింతగా పట్టుదలతో ముందుకు తీసుకెళతానని అన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో గతమెంతో ఘనంగా బతికిన చేనేత కార్మికులు, కొందరు పాలకుల విధానాల వల్ల ధ్నెన్యంగా బతుకీడ్చుతూ ఉండాల్సిన అవసరం లేదన్నారు. అందుకోసం రాజకీయంగా, విద్య, ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ హయాంలో మంచి జరుగుతుందని కమర్తపు మురళి ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు హయాంలో పద్మశా లీలు, నేత కార్మికుల బతుకు చిత్రం మారిపోయేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

# యాదవులను బీసీ "ఏ" లో చేర్చాలి



**తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజు యాదవ్**

**(కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులను బిసి "డి "నుంచి బీసీ "ఏ" కు మార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో యాదవులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని ఇప్పటికీ చాలా చోట్ల యాదవులు గొర్రెలు మేకలు పెంపక దారులు దినసరి వేతన కార్మికులుగా జీవనం సాగిస్తున్నారని, వీరు పిల్లల్ని చదివించు కోవాలన్న చాలా ఇబ్బందులు పడుతు న్నారని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న యాదవులకు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత ఉన్న సరైనటువంటి రిజర్వేషన్ లేక తక్కువ తేడాతో ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, యాదవులు బి సి" డి "కేటగిరి లో ఉండడం వల్ల యువత విద్య ఉద్యోగ రిజర్వే షనలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని గత ప్రభుత్వాలు యాదవులని బీసీ"ఏ" లోకి మారుస్తామని చివరికి మొండి చేయి చూపించాయని ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల కోసం సాహ సోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజా పాలనలో దూసు కుపోతున్న మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు యాదవుల న్యాయం చేస్తారని ఆశగా ఎదురు చూస్తు న్నారని కావున సీఎం గారు యాదవుల పరిస్థితులను అర్థం చేసుకొని తగు నిర్ణయం తీసుకొని యాదవులను బి సి "డి" నుంచి బీసీ "ఏ" రిజర్వేషన్ లోకి మార్చాలని రిజర్వేషన్ మార్చడం వలన మా యాదవ యువతి, యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని సూత్రపు రాజు యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు..

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని సూపర్ డెంట్‌కు వినతి పత్రం అందజేత

**(కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి)**

గత ఆరునెలలు గా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించి వైద్య సిబ్బందిని ఆదుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ జిల్లా వైద్య అధికారులను కోరారు. స్థానిక సిహెచ్ ఆస్పత్రిలో సాయినాథ్ ఏజెన్సీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ కు గత ఆరు నెలలు గా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు అధ్వర్యంలో కార్మికులు సోమవారం సూపరింటెండెంట్ రమేష్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం ప్రతి పేదవారికి అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి చేయుతనిస్తూ ప్రభుత్వ వైద్య అధికారులు, సిబ్బందితో పాటు రాత్రులు, పగలు విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బం దికి వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నా రు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో నిత్యావసర వస్తు వులు, కిరాయిలు తదితర కుటుంబ ఆర్థిక పరిస్థితులు రోజుకు



రోజు చెల్లించలేక కార్మికులు తిప్పలు పడుతు న్నారని ప్రభుత్వ ఇకనైనా స్పందించి ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఔట్ సోర్సింగ్ కార్మికులు దేవరాజ్, నరేష్,రమేష్,గోరి బాయి, విజయలక్ష్మి, వీరేందర్, వినోద్, సింధు,ఎల్లయ్య, కళ,ఉమా,జాన్‌బి తదితరులు ఉన్నారు...

# ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



**కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి**

గార్ల మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ లో గత మూడు వారాలుగా మంచినీటి సరఫరా లేక గిరిజనులు ఇబ్బం దులు పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం అని సిపిఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పుల్లూరు పంచాయతీ పరిది లోని సూర్య తండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం సిపిఎం అధ్వర్యంలో తండాలో రోడ్డు పై బైటా యించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ మండలాలలో మంచి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారుల కు ఎన్ని సార్లు చెప్పిన మండల అధికారులు నిమ్మ కు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అందో ళన వ్యక్తం చేశారు.సుమారుగా 20 కుటుంబాలకు నీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికా రులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని గిరిజన మహిళలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపాదికన మంచినీటి సమస్యను పరిష్క రించి గిరిజనుల దాహార్తిని తీర్చాలని లేని యెడల దశల వారీగా అందోళన చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అజ్మీర శ్రీను,రమేష్, సాయి,నరేష్, ప్రవీణ్, రాందాస్, సీతా, మంజుల,హరి లక్ష్మీ, బాస్,వినోద్, కాంతి,భీమ్లా,మంగి,నీలా,మంగ్యి తదితరులు ఉన్నారు.

# చుక్కల్లో చికెన్ ధరలు

**ధర పెరగడంతో తగ్గిన విక్రయాలు**

**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**



చికెన్ ధర చుక్కల్లోకి ఎక్కి కూర్చుంది. వారంతో సంబంధం లేకుండా నోరూరినప్పుడల్లా చికెన్ షాపుకి పరుగులు తీసే మాంసాహార ప్రియులు ఇప్పుడు కాస్త వెనకడుగు వేయాల్సి వస్తోంది. జేబు తడిమి చూసుకుని ఒకింత ఆలోచించాల్సి వస్తోంది. ఓపక్క ఏపీలో బర్డ్ ఫ్లూ ప్రభావంతో కోళ్లు చనిపోతున్న పరిస్థితి నెలకొనగా తెలంగాణలో ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో చికెన్ ధరలు అమాంతం పెరిగాయి. గడిచిన కొద్ది రోజులుగా కోడి ధర అంతకంతకూ కొండెక్కుతోంది. చికెన్ రేటు అమాంతం పెరగడంతో మాంసహార ప్రియులు గగ్గోలుపెడుతున్నారు. ఓ వైపు బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్, మరోవైపు కోళ్ల సరఫరా తగ్గడంతో ధరలు ఆల్ టైం రికార్డుకు చేరుకుంటున్నాయి. ఫలితంగా చికెన్ ధర తగ్గుముఖం పట్టే ప్రసక్తే లేకుండా పెరిగిపోతోంది. ఇక తప్పేదీలేదనుకున్న మాంసాహార ప్రియులు కొనుగోలు చేస్తుంటే కోడి ధరలు చూసి సామన్యుడు మాత్రం బెంబేలెత్తిపోతున్నాడు. చికెన్ తినే కోరికను వాయిదా వేసుకుంటున్నాడు. తాజాగా ఒక్క రోజులోనే చికెన్ ధరలు ఆల్ టైం రికార్డుకు చేరుకోవడం గమనార్హం. **ఉత్పత్తి తగ్గడంతో..** బుధ, గురు వారాల్లో రూ.150 నుంచి 200 ఉన్న కిలో లైవ్ కోడి.. ఆది, సోమ వారాల్లో అమాంతం పెరిగిపోయింది. కోళ్ల సరఫరా తగ్గడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. వినియోగ దారుల అవసరం మేరకు ఉత్పత్తి లేకపోవడంతో కోడి మాంసం ధరలు కొండెక్కాయి. ప్రస్తుతం స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.300పైనే ఉంది. స్కిన్ తో అయితే రూ.260 అమ్ముతున్నారు. ఇక బోన్ లెస్ చికెన్ రికార్డు స్థాయిలో కిలోకు రూ.500 కు పైగా అమ్ముతున్నారు. ఈ ధరల్లో ప్రాంతాల వారీగా హెచ్చుతగ్గులు కనిపించడం సర్వసాధారణంగా మారింది. కొన్ని చోట్ల వ్యాపారులు సిండికేట్ గా మారి ఇష్టారీతిన ధరలను నిర్ణయించేస్తున్నారు. ఓవైపు బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్, మరోవైపు ఎండల తీవ్రత ఎక్కువైతే చికెన్ ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు చెబుతు న్నారు. ఆదివారం వస్తే చాలు గ్రేటర్ హైదరాబాద్ వాసులకు ముక్కలేకపోతే ముద్ద దిగదు. ఆదివారం సుమారు 12 లక్షల కిలోలు, మిగిలిన రోజుల్లో సుమారు 7 లక్షల వరకు చికెన్ విక్రయాలు ఇక్కడ జరుగుతుంటాయి. ఇదిలా ఉండగా తాజాగా ధరల పెరుగుదలతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ ధరలు అధికంగా ఉండటంతో మాంసం ప్రియులు చేపల వైపు మొగ్గు చూపుతున్నారు.

# విజయ సంకల్ప రథయాత్రకు విశేష స్పందన





**ఒక్కసారి బీజేపీ కి అవకాశమివ్వండి: ఖమ్మం ప్రజలకు కమల నేతల పిలుపు**

**(ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్)**

మూడో సారి మోడీ సర్కార్ అన్న నినాదంతో భారతీయ జనతా పార్టీ చేపట్టిన భద్రకాళి – కాకతీయ క్లస్టర్ రథ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొత్త గూడెంలో ప్రారంభమైన రెండో రోజు యాత్ర ములకలపల్లి, దమ్మపేట, సత్తుపల్లి, కల్లూరు మీదుగా సాగింది. దారిపొ డవునా ప్రజలు నాయకులకు, కళా బృందాలకు స్వాగతం పలికారు. వివిధ పార్టీలకు ఇన్నేళ్లు అవకాశం ఇస్తున్న ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ ఒక్కసారి బీజేపీ కి అవకాశం ఇవ్వాలని నాయకులు కోరారు. "కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో కోట్లాది మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరింది. వందల ఏళ్ళ నాటి సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మరో సారి మోడీ సర్కార్ వస్తే భారత్ మరింత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. ఖమ్మం ప్రజలు కూడా మోడీ జీ ని బలోపేతం చేసి తమకు తాము మేలు చేసుకోవాలి," అని వివిధ సభల్లో ప్రసంగించిన నిర్మల్ శాసన సభ్యులు, అసెంబ్లీ లో బీజేపీ పక్ష నాయకుడు ఆలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. ములకలపల్లి గ్రామంలో వందలాది మంది బిజెపి శ్రేణులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక బృం దాలు దమ్మపేటలో కోలాటంతో కోలాహల వాతావరణం సృష్టించాయి. కల్లూరులో జరిగిన రోడ్ షో కు అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా బీజేపీ



నాయకుడు వినోద్ రావు తాండ్ర కార్యకర్తలను కలుసుకుని మాట్లా డారు. "ఇప్పుడు వచ్చిన ఒక సువర్ణ అవకాశాన్ని ఖమ్మం ప్రజలు విడవకూడదు. ఖమ్మం ఏమి పాపం చేసిందని అభివృద్ధికి దూరంగా ఉండాలి" అని అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమే%శీ%దర్ రెడ్డి, పార్లమెంట్ ప్రభారీ శ్రీకాంత్, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామ లింగేశ్వర్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పోలియో నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

**ప్రభుత్వ నోడల్ వైద్యఅధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్**

**(కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి)**

గార్ల మండలంలో మార్చి నేల మూడో తారీఖున ఆదివారం రోజు జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ జాధవ్ ఆదేశించారు. సోమవారం మండల పరిది పర్యటనలో భాగంగా మర్రిగూడెం పల్లె దవఖానను సందర్శించారు. కొద్దిసేపు వైద్యులు, యంఎల్ హెచ్ పి లు ,స్టాఫ్ నర్సింలు , ఏ ఎన్ యం లు, ఆశావర్కర్ల పనిచేస్తున్న తీరుని పరిశీలించి, ఓపి రిజిస్టర్ లను, అటెండెన్స్ రిజిస్టర్ లను తనికి చేసి , ఏవరి విధులను వారు సక్రమంగా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ జాధవ్ మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు వారు 62 వేలకు పైగా ఉన్నారని ,గార్ల మండలంలో 2 వేలకు పైగా చిన్నారులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మార్చి మూడవ తేదీన పోలియో చుక్కలు వేసేందుకు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టినందున సంబంధిత సబ్ సెంటర్ల ఏఎన్ఎం,ఆశాలు, అంగనవాడిలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రధానంగా మురికివాడలు, గిరిజన ఏజన్సీ ప్రాంతాలు లక్ష్యంగా పెట్టుకోవాలని ఏజెన్సీ ప్రాంతంలో, ప్రధాన కేంద్రాలలో పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పల్స్ పోలియో చుక్కల విశిష్టతపై విస్తృత ప్రచారం చేపట్టాలని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించాలని ఫ్లెక్సీల ద్వారా ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి మూడో తేదీన, ఆదివారం ఉదయం 7 గంటల నుండి పల్స్ పోలియో కార్యక్రమం మొదలవుతుందని సాయంత్రం 5 గంటల వరకు నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అంతేగాక పోలియో చుక్కలు వేసేందుకు వైద్య సిబ్బంది మొబైల్ వాహనంలో పర్యటించ నున్నందున పల్స్ పోలియో చుక్కలు అందని చిన్నారుల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో లేనివారు మార్చి 4 , 5 తేదీలలో ఇంటింటి సర్వే చేపట్టి చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది పర్యటించనున్నట్లు



తెలియజేశారు. మహిళా సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు,యువకులు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందే విధంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీహరి, డాక్టర్ నవీన్ కుమార్, వేణు మాధవ్, సబ్ సెంటర్ ఇన్చార్జి సూపర్డెంట్ బుజ్జి, స్టాప్ నర్సులు సీత,సునీత,రజిత, ఆశా వర్కర్ పార్వతి,జ్యోతి గ్రామ యూత్ నాయకులు మాళోత్ శాంతికుమార్, భూక్యరామ్ సింగ్,బానోత్ మల్లిబాబు,మధు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధిలో ఎంపీ నామ ది కీలకపాత్ర

**జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు**

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

గ్రామాల అభివృద్ధిలో ఖమ్మం పార్లమెంట్ సభ్యునిగా నామ నాగేశ్వర రావుది కీలకపాత్ర అని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. మధిర మండలం ఇల్లూరు గ్రామ అభివృద్ధి కోసం ఎంపీ నిధుల నుండి నామ నాగేశ్వరరావు గారు మంజూరు చేసిన రూ.10 లక్షల రూపాయలతో చేపట్టే రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన బీటీ రోడ్ల కోసం కేంద్ర ప్రభుత్వ పీఎంజియస్ వై పథకం నుండి కోట్లాది రూపాయలు మంజూరు చేపించి తీసుకువచ్చిన ఘనత నామ నాగేశ్వరరావు కే దక్కుతుందన్నారు. పార్లమెంట్ లో రాష్ట్రానికి రావాల్సిన పలు పెండింగ్ ప్రాజెక్ట్ లు నిధుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతును గట్టిగా వినిపించి అలుపెరగని పోరాటం చేస్తున్న నామ. నాగేశ్వరరావు కి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు , ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు , మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు , నాయకులు మొండితోక జయకర్ , గ్రామ మాజీ సర్పంచ్ జవ్వాజి రవి ,దామా శేషగిరి , బొగ్గుల వీరారెడ్డి , కొటారి రాఘవరావు , దామా కిశోర్ , మెట్టెల ప్రసాద్ , దుగ్గినేని వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# శిధిలావస్థలో అంగన్ వాడి భవనం



**(బోనకల్, కెరటం న్యూస్ ప్రతినిధి)**

బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం (ఏ) గ్రామంలోని అంగన్వాడి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రతిరోజు అంగన్వాడి కి హాజరవుతున్న చిన్నారులకు కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు నాడు నిర్మించిన రైతు వేదికలోకి అంగన్వాడి కేంద్రాన్ని తరలించారు. బాగం నాగేశ్వరరావు చిన్నారులకు హార్లిక్స్, పండ్లు అందజేశారు. గది పైపెచ్చులు ఊడి పడుతుం డటంతో చిన్నారులు భయాందోళనకు గురవుతు న్నారనీ అంగన్వాడి టీచర్ లక్ష్మీ తెలిపారు. అంగన్వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో చేసేదేమీ లేక కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వం రావు ను ఆశ్రయించగా నాడువారు నిర్మించిన రైతు వేదికలో అంగన్వాడీ కేంద్రాన్ని నడుపుకోవాలని సలహా ఇచ్చినట్లు చెప్పారు. అంగన్వాడీ భవన మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయాలని ఆళ్లపాడు ఎంపిటిసి పారా శ్రీదేవి భట్టి విక్రమార్కుని కోరారు. 2019లో సుమారు నాలుగు లక్షల రూపాయల ఖర్చుతో సొంత స్థలంలో ఆయన ఈ వేదికను నిర్మించారు. ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రైతు వేదికను నాడు ప్రారంభించారు. నాటినుండి గ్రామ ప్రజలు పలు విధాలుగా ఈ వేదికను ఉపయోగించుకుం టున్నారు. ఈ కార్యక్రమంలో ఆలపాడు గోవిం దాపురం ఎంపీటీసీ శ్రీమతిపారా శ్రీదేవి అల్లపాడు గోవిందాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# నేడు ఘనంగా ప్రారంభం కానున్న మారాయిగూడెం సమ్మక్క సారలమ్మ జాతర

- మినీ మేడారంగా పిలుచుకునే ఈ జాతరకు తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ ఒరిస్సా మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జాతర నిర్వహణ కమిటీ
- ఆదివాసి జాతర్లను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్న ఆదివాసీ గిరిజన సంఘాలు.

**(కెరటం న్యూస్ ఫిబ్రవరి 26 దుమ్ముగూడెం)**

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారాయి గూడెం గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దేవతలైన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఫిబ్రవరి 27వ తేదీనుండి మార్చి రెండో తేదీ వరకు జరగనుండగా జాతర మహోత్సవములకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జాతర నిర్వహణ కమిటీ దేవర బాలలు తెలిపారు ఆదివాసీలు ఇలవేల్పులుగా కొలుచుకునే సమ్మక్క సారమ్మ లు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ఈ తల్లులకు ప్రసిద్ధి దేవర బాలలైన సోడి శాంతమ్మ అచ్చమ్మ లకు గత అనేక సంవత్సరముల క్రితం కలలో కనిపించిన ఆ తల్లులు మారాయి గూడెంలో తమకు జాతర జరపాలని చెప్పి నట్లు ఆనాటి నుండి ప్రతి రెండు సంవత్సరములకు ఒకసారి మేడారం జాతర ముగిసిన కొద్ది రోజులలో మారాయి గూడెంలో మినీ మేడారం జాతరగా జాతర జరుగుతున్నట్లు దేవర బాలలైన సోడి శాంతమ్మ అచ్చములు తెలిపారు 27వ తేదీ మంగళవారం మండ మెలుగుట తో జాతర ప్రారంభం కానుండగా 28 వతేది జాతర రెండో రోజు కార్యక్రమంలో ఒక పొద్దు రాత్రి 10 గంటలకు దేవత నిసానులను గుడికి తీసుకురావడం జరుగుతుంది 29వ తేదీ గురువారం జాతర మూడో రోజు కార్యక్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు వనదేవత గుడికి రానుండగా సాయంత్రం నాలుగు గంటలకు తల్లి దేవత గుట్ట నుండి గుడికి వస్తుంది జాతర నాలుగో రోజు కార్యక్రమంలో శంకు పండగ దేవుని దర్శనం ఐదోవ రోజు చివరి రోజైన జాతర కార్యక్రమంలో తల్లి దేవత తిరిగి గుట్టకు వెళ్లడంతో జాతర ముక్కుతు%శీ%ది జాతరకు తెలంగాణ రాష్ట్రం నుండి కాక చత్తీస్గడ్ ఆంధ్ర ప్రదేశ్ ఒరిస్సా మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి కూడా కేవలం ఆదివాసీలే కాకుండా అన్ని కులాలు అన్ని వర్గాలకు చెందిన భక్తులు ప్రజలు మేడారం జాతరకు వివిధ కారణాలతో వెళ్ళలేని భక్తులు అమ్మవార్ల మీద భక్తితో నమ్మకంతో వేలాదిగా జాతరకు హాజరై మొక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహిస్తుంటారు ఇప్పటికే జాతర కమిటీ సమ్మక్క సారలమ్మ గద్దెలను రంగులు వేసి సిద్ధం చేయగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారు ఆలయానికి వెళ్లె మార్గంలో తాత్కాలిక స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు విద్యుత్ దీపాలతో అలంకరించారు అనేక రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు ఈ జాతరకు హాజరవుండగా భక్తులు సేద తీరేందుకు అమ్మవార్ల సన్నిధిలో నిద్ర చేసేందుకు గుడారాలు టెంట్లు తాత్కాలిక గుడిసెలు పందిళ్ళు వేసుకోవడానికి అణువుగా గుడి చుట్టుపక్క పరిసర ప్రాంతాలలో జెసిబి తో పిచ్చి మొక్కలను పొదలను తొలగించి శుభ్రపరిచారు . మారాయిగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించడం త్రాగునీటి ఏర్పాట్లను చేపట్టారు చిరు వ్యాపారుల దుకాణాలు ఏర్పాటు కోసం సమ్మక్క సారక్క కల గద్దెల కు వేళ్ళ మార్గానికి ఇరువైపులా పాకలను ఏర్పాటు చేశారు మినీ మేడారం మారాయి గూడెం జాతరకు చేరుకునేందుకు భద్రాచలం ఆర్టిసి బస్సు డిపో ద్వారా కొన్ని సర్వీసులు నడపబడుతుండగా ప్రస్తుతం ఆ సర్వీసులు



నిలిపివేయబడ్డాయి మేడారం ప్రత్యేక సర్వీసులు నడిపిన పద్ధతిలోని మారాయిగూడెం జాతర వరకైనా ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సర్వీసులను నడపాలని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల అనేక మంది మహిళలు ఈ జాతరకు హాజరయ్యే అవకాశం ఉంటుందని ఆర్టీసీ అధికారులు ఈ విషయంపై స్పందించాలని పలువురు విజ్ఞప్తి చేశారు ఈ జాతరకు హాజరయ్యే భక్తులకు ప్రస్తుతం ఆటోలు వాటిలో ఉంటున్నాయి పాడు సెంటర్ నుండి వయా ఆర్లగూడెం లచ్చిగూడెం గ్రామాల మీదుగా జాతర జరిగే గ్రామం మారాయిగూడెం కి చేరుకోవచ్చు మరో మార్గమైన భద్రాచలం వయాతునికి చెరువు రామచంద్ర పేట మీదుగా ఆటోలపై ప్రైవేటు వాహనాలపై కూడా భక్తులు మారాయిగూడెం జాతరకు చేరుకునే అవకాశం ఉన్నది

**ఆదివాసీల అరాధ్య దైవాలు వనదేవతలైన సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి జాతరను నిర్వహించాలి**

ఆదివాసీల ఆరాధ్య దైవమైన వనదేవతలైన సమ్మక్క సారలమ్మ మినీ



మేడారం మారాయిగూడెం జాతరకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు కేటాయించి జాతర నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి ఆదివాసీల ఇలవేల్పుల జాతరలు ఆదివాసీల మూలాలకు సాక్షాలని ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలను పండుగలను జాతర్లను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ద్వారానే ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు రక్షింపబడతాయని తెలంగాణ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని పలువురు ఆదివాసి సంఘాల నాయకులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు జిల్లా ఉన్నతాధికారులు ప్రతి జాతరలో ప్రభుత్వ ప్రతినిధిగా జాతరలో పాల్గొని జాతర విశేషాలను క్షుణ్ణంగా పరిశీలించి జాతర విశిష్టతను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు ఆదివాసి గిరిజనులు తాము చెట్టును పుట్టని రాయిని పూజించడంలో సైన్స్ సైతం అంతుపట్టని జీవ వైవిధ్యం దాగి ఉందని ఇంతటి ప్రాముఖ్యత గల ఈ విషయాన్ని పాలకులు అధికారులు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని వారు కోరారు

### సేవాలాల్ మహారాజ్ జయంతి ముగింపు

## ఉత్సవాలను జయప్రదం చెయ్యండి



**(కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి)**

ఫిబ్రవరి 27న ఇల్లందు లో జరుగు శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్ర మంలో గార్ల మండల బంజారా జాతి ప్రజలు నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గార్ల మండల ఎంపిపి బట్టు నాగరాజు స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోరారు.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఇల్లందు నియో జకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొంటారని ఎంపిపి తెలిపారు. ఈ సమావేశంలో బంజారా నాయకులు జాటోత్ రమేష్, బానోత్ కిషన్, మాలోత్ శంకర్, ధరావత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### 28న జరగబోయే విజయసంకల్పయాత్రను

## విజయవంతం చెయ్యండి



**(కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి)**

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు జశ్వంత్ ఠాకూర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నటువంటి దొంగల సత్యనారాయణ మాట్లాడుతూ బిజెపి పార్టీ చేపట్టిన టువంటి విజయ సంకల్ప యాత్రలో భాగంగా 28 ఉదయం 10 గంటలకు గార్ల మండల కేంద్రానికి యాత్ర చేరుకుంటుందని, కావున ఈ యాత్ర కు అధిక సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు పాల్గొని యాత్రను విజయవంతం చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తోడేటి నాగరాజు, జిల్లా నాయకులు అజ్మీర రాము, జంపాల శ్రీను, మండల నాయకులు బుచ్చిబాబు , దేవ. గణేష్ , నరేష్, చిరంజీవి, వీరస్వామి, వీర్య నాయక్ పిచ్చయ్య,హరి, తదితరులు పాల్గొన్నారు...



## రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**(కెరటం న్యూస్ ఫిబ్రవరి 26 దుమ్ముగూడెం)**

కొత్త దంతెనం గ్రామపంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 10 లక్షల రూపాయలతో ఆర్ అండ్ బి ప్రధాన రహదారి నుండి తాలిపేరు కెనాల్ వరకు 900 మీటర్ల గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు సిడిపి నిధులు 5లక్షల. రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భద్రాచలం ఎమ్మెల్యే డా"తెల్లం వెంకట్రావు సోమవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమం లో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు తునికి కామేశ్వరరావు, అపకా వీర్రాజు, కాలువ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాసరావు, తోట రమేష్, మోతుకూరి శ్రీకాంత్, కొత్త మల్లేశ్వరరావు, బొల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎం

## తనయుడి మానవత్వం



**వీధి వ్యాపారులకు నీడ గొడుగులను పంచిన సూర్య విక్రమాదిత్య**

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

స్థానిక శాసనసభ్యులు ఉపముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టివిక్రమార్కతనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య ఈరోజు పట్టణం లో గల తోపుడుబండ్లపై చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న దాదాపు 200 మంది కి నీడ గొడుగులను పంచి తన యొక్క ఔదార్యాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డి, పట్టణ15 వార్డ్ కౌన్సిలర్ కోన దనికుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు దుంప వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు,నిడమానూరు వంశీ కృష్ణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, పట్టణ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు షేక్ బాజీ, పారుపల్లి విజయ్ కుమార్, కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మీ రమేష్,యన్నం కోటేశ్వరావు, టీవీ రెడ్డి, కోటా డేవిడ్, గొల్ల మందల శ్రీనివాస్ అదిములం శ్రీనివాస్ బోలెద్దు రాజేంద్ర పగిదిపల్లి డేవిడ్, రావిరాల సత్యనారాయణ, మైలవరపు చక్రి తదితరులు పాల్గొన్నారు.

### బ్రిడ్జిని ప్రారంభించిన జడ్పీ చైర్మన్

## లింగాల కమల్ రాజు

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

మధిర మండలం తోండలగోపవరం గ్రామం లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి ను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ రైల్వే వ్యవస్థ లో అనేక మార్పులు జరుగుతున్న క్రమం లో వంతెన లు నిర్మాణం, ఫ్లై ఓవర్ల నిర్మాణం, మూడో రైల్వే ట్రాక్ నిర్మాణాలు పనులు కొనసాగుతున్నాయని రైల్వే లో ఇలాంటి అభివృద్ధి పనులు జరగడం మంచి పరిణామం అని అతి తొందరలో పనులు పూర్తిఐ ప్రజలకు వినియోగంలోకి రావాలని కోరుకుంటున్నాను



అని దానిలో భాగంగా సోమవారం వంతెన ప్రారంభోత్సవం శుభ పరిణామం అని ఇదేవిదంగా భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## పల్స్ పోలియోపై కళాజాత

**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు ప్రోగ్రాం అధికారుల ఆదేశాలు మేరకు పీహెచ్ సి దెందుకూరు వైద్యులు డా పృథ్వి రాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది ఆరోగ్యపరి వేక్షకుడు జానపద కళాకారుడు లంకా కొండయ్య ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీ దేశ వ్యాప్త%శీ%గా నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమంలో మీ పిల్లలు అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు కొని 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా నిండు జీవితానికి రెండుపోలియో చుక్కలు వేపించాలి అని సంపూర్ణముగా పాటల ద్వారా అవగాహన పరిచారు.ఈ కార్యక్రమం ఖమ్మం పాడు ఎస్సి కాలనీ అంగన్వాడీ కేంద్రం



చింతచెట్టు వద్ద జన సమూహ ప్రాంత%శీ% వద్ద కళా జాత ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ సనప గోవింద్ హెల్త్ విజిటర్ బి కౌసల్య ఎఎన్ఎమ్ భారతి నాగమణి అంగన్వాడీ టీచర్ మువ్వ పద్మావతి ఆశ కార్యకర్తలు నాగుర్ భీ నాగమణి ఐకేపీ సిబ్బంది జిపి సిబ్బంది పాల్గొన్నారు.

### పిహెచ్‌సి దెందుకురులో

## సుఖ ప్రసవాలు

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**

మండలపీహెచ్ సి దెందుకు రు వైద్య లు డా పృథ్వి రాజ్ నాయక్ ఆధ్వర్యంలో లో సోమవారం ఉదయం ఇద్దరు గర్భిణీ స్త్రీ లుకు సుఖ ప్రస వా లు నిర్వహించి పండు అంటి మగ పిల్లలు కు జన్మనిచ్చి నారుకూట%శీ% నాగ దుర్గ (బర్త రాంబాబు )కు మగ బిడ్డ మడు పల్లి మరియు తోట కుమారి (బర్త కృష్ణా )కూ మగ బిడ్డ లడక బజర్ తల్లి పిల్లలు క్షే మ ము గా వున్నారు వెంట నే పీహెచ్ సి సిబ్బంది పుట్టి నా పిల్లలు కూ జి రో డోసు టీకాలు వేశారు తగినంత బరువు వున్నారని వైద్య సిబ్బంది



తెలిపేరు. గ్రామీణ పీహెచ్ సిలో ఎక్కువగా ప్రతి నెల సుఖప్రసావాలు నిర్వహిస్తూన్న డా పృథ్వి రాజ్ నాయక్ మరియ డా హేమ లత మరియు నర్సింగ్ ఆఫర్స్ రజిని అనూష ఆరునా సృజన మరియు ఫీల్డ్ పారా మెడికల్ బృందం ను గ్రామ ప్రజా ప్రతి నిధులు మండలప్రజా ప్రతి నిధులు అధికారులు అభినందనలు తెలుపారు

## తమ్మినేని పరామర్శించిన కందడా

**ఖమ్మం రూరల్, కెరటం న్యూస్**


సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే.మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో సోమవారం తమ్మినేనిని ఆంధ్రప్రదేశ్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కందాడ మురళి పరామర్శించారు.ఈ సందర్భంగా గత స్మృతులను నెమరు వేసుకున్నారు.తమ్మినేని త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని మురళి ఆకాంక్షించారు.అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన సిపిఎం సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి సిపిఎం సీనియర్ నాయకులు పి. సోమయ్య సతీమణి సుశీలమ్మను పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.వీరంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సిపిఎం సీనియర్ నాయకులు పి.సోమయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టి నవ్వుతున్న జెసిబిని ట్రాక్టర్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**కెరటం న్యూస్ ఫిబ్రవరి 26 దుమ్ముగూడెం**

మండల పరిధి పెద్దనల్లబల్లి గ్రామములో సాయంత్రం 6 గంటల సమయం లో అక్రమంగా జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం దుమ్ముగూడెం తాసిల్దార్ చంద్రశేఖర్ కి తెలియడంతో వెంటనే సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపగా సంఘటనా స్థలంలో జెసిబి మరో నాలుగు ట్రాక్టర్లని అదుపులోకి తీసుకున్నారు అదుపులోకి తీసుకున్న ఈ వాహనాలని దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా నాలుగు ట్రాక్టర్లు మార్గమధ్యలో తప్పించుకొని పారిపోయినట్లు తెలిసింది తాసిల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐపి లక్ష్మయ్య రెవెన్యూ సిబ్బంది సహాయంతో అదుపులోకి తీసుకొన్న జేసిబీని దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌కి తరలించారు



## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**కెరటం న్యూస్ ఫిబ్రవరి 26 దుమ్ముగూడెం**

మండల పరిధి పెద్ద కమలాపురం గ్రామంలో ఒక ఇంట్లో ఒడిషా రాష్ట్రానికి చెందిన రతన్ బిశ్వాల్ అనే వ్యక్తి సేకరించి దాచిన సుమారు 3క్వింటా రేషన్ బియ్యాన్ని పట్టుకొని దుమ్ముగూడెం పోలీసులు సోమవారం పట్టుకున్నారు పట్టుకున్న అక్రమ బియ్యాన్ని దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌కు తరిలిచారు అక్రమంగా ఉంచిన ఈ బియ్యాన్ని సివిల్ సప్లయ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ తెలిపారు